ఆర్థిక అనుమతులు ఇప్పించండి

- హైదరాబాద్-శ్రీశైలం ఎలివేటెడ్ కారిడార్ మంజూరు చేయండి
- కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రీజినల్ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్) ఉత్తర భాగానికి (159 కి.మీ.) అవసరమైన సాంకేతిక, ఆర్థికపరమైన అనుమతులు వెంటనే ఇవ్వాలని జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి గడ్కరీతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం రాత్రి సమావేశమయ్యారు. 2017లోనే ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగాన్ని 161ఏఏ జాతీయ రహదారిగా ప్రకటించారని సిఎం గుర్తు చేశారు. ఇప్పటికే ఈ రహదారి నిర్మాణానికి అవసరమయ్యే భూమిలో 94 శాతాన్ని రాష్ట్ర ప్రభుత్వం సేకరించిందని కేంద్ర మంత్రి దృష్టికి ముఖ్యమంత్రి తీసుకెళ్లారు. దక్షిణ కాశీగా గుర్తింపు పొందిన శ్రీశైలంను హైదరాబాద్ తో అనుసంధానించే ఎన్‌హెచ్-765లో 125 కిలోమీటర్ల దూరం జాతీయ రహదారుల ప్రమాణాలతో ఉందని, మిగిలిన 62 కిలోమీటర్లు ఆమ్రాబాద్ అటవీ ప్రాంతంలో ఉందని తెలిపారు. అటవీ, పర్యావరణ శాఖ నిబంధనల ఫలితంగా ఆ మేరకు రహదారి అభివృద్ధికి ఆటంకంగా ఉందని, కేవలం పగటి వేళలో మాత్రమే రాకపోకలు సాగించాల్సి వస్తోందని కేంద్ర మంత్రికి వివరించారు. ఆమ్రాబాద్ అటవీ ప్రాంతంలో నాలుగు వరుసల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని, ఇందుకు 2024-25 బడ్జెట్లో నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఎలివేటెడ్ కారిడార్ నిర్మిస్తే హైదరాబాద్ ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా మధ్య 45 కిలోమీటర్ల దూరం తగ్గుతుందని ముఖ్యమంత్రి వివరించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ముఖ్య నగరాలైన హైదరాబాద్-విజయవాడ (ఎన్.హెచ్-65) రహదారిని ఆరు వరుసలుగా విస్తరించే పనుల డిపిఆర్‌ను త్వరగా పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. ఈ రహదారి విస్తరణ పనులు పూర్తయితే ప్రమాదాలకు అడ్డుకట్ట వేసి ప్రయాణికుల ప్రాణాలు కాపాడిన వారమవుతామని చెప్పారు. తెలంగాణలోని రెండో పెద్ద నగరమైన వరంగల్ దక్షిణ భాగం బైపాస్ నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్‌ను అనుసంధానించే ఎన్‌హెచ్-63 (16) వరంగల్, హన్మకొండ నగరాల మధ్యగా వెళుతోందని.. ఈ రహదారిని నగరం వెలుపల నుంచి నాలుగు చోట్ల కలుపుతూ బైపాస్ మంజూరు చేయాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. పర్వత్ మాల ప్రాజెక్ట్‌లో యాదాద్రి దేవాలయం, నల్గొండ పట్టణంలోని హనుమాన్ కొండ, నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ వద్ద రోప్ వే లను ఏర్పాటు చేయాలని కోరారు. గోదావరి, కృష్ణా నదులపై గిరిజనులు అత్యధికంగా నివసిస్తున్న ప్రాంతాల్లో.. ప్రజా రవాణాకు ఇబ్బందిగా ఉన్న 10 చోట్ల పాంటూన్ బ్రిడ్జిలు మంజూరు చేయాలని, నల్గొండ జిల్లాల్లో ఎన్.హెచ్-65 పక్కన 67 ఎకరాల ప్రభుత్వ భూమిలో ట్రాన్స్‌పోర్ట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏర్పాటు చేయాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఎంపిలు చామల కిరణ్ కుమార్ రెడ్డి, రామసహాయం రఘురాంరెడ్డి, సురేశ్ షెట్కార్, మల్లు రవి, కడియం కావ్య, ఎం. అనిల్ కుమార్ యాదవ్, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి ఉన్నారు.



నితిన్‌గడ్కరీతో చర్చిస్తున్న సిఎం రేవంత్, పక్కన రాష్ట్ర మంత్రులు

సింగరేణికి కోల్ బ్లాక్‌లు కేటాయించండి

తెలంగాణ రాష్ట్రంలో వివిధ రకాల అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ఇచ్చేందుకు కృషి చేయాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.. ప్రాంతీయ రింగు రోడ్డు (ఆర్‌ఆర్‌ఆర్), హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 తోపాటు హైదరాబాద్, వరంగల్‌ల్లో సీవరేజీ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్లాన్... సింగరేణి సంస్థకు బొగ్గు గనుల కేటాయింపు సహా పలు అంశాలపై కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి చర్చించారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా మొత్తం రూ.1,63,559.31 కోట్ల విలువైన ప్రాజెక్టుల విషయంలో కేంద్రం నుంచి కావల్సిన చేయూతపై కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి చర్చించారు. ఆర్‌ఆర్‌ఆర్ నిర్మిస్తామని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 2022లోనే ప్రకటించిన విషయాన్ని గుర్తు చేశారు.ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తర భాగం భూ సేకరణను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందని, త్రైపాక్షిక ఒప్పందం పూర్తయినా ఇప్పటి వరకు ఎన్‌హెచ్ఎఐ అనుమతి ఇవ్వలేదని తెలిపారు. ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగానికి ఇంకా అనుమతి ఇవ్వని విషయాన్ని కేంద్ర మంత్రికి సిఎం గుర్తు చేశారు. ఆర్‌ఆర్‌ఆర్‌తో పాటు రేడియల్ రోడ్లు పూర్తయితే ఫార్మా పరిశ్రమలతో పాటు ఇండస్ట్రియల్ హబ్‌లు, లాజిస్టిక్ పార్క్స్, రిక్రియేషన్ పార్కులు వంటివి అభివృద్ధి అవుతాయని అన్నారు. ఒఆర్‌ఆర్- ఆర్‌ఆర్‌ఆర్‌ల అనుసంధానానికి రేడియల్ రోడ్లు నిర్మించాలని సంకల్పించామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి సిఎం రేవంత్ రెడ్డి తెలిపారు. 10 గ్రీన్‌ఫీల్డ్ రోడ్లతో పాటు ఒఆర్‌ఆర్ అనుసంధానించే మెట్రో కారిడార్ రేడియల్ రోడ్లకు రూ.45 వేల కోట్లు వ్యయమవుతాయని కేంద్ర మంత్రికి సీఎం వివరించారు.

మూసీరివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు రక్షణ శాఖ పరిధిలోని 222.27 ఎకరాల భూమి రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను ఇప్పటికే కోరిన విషయాన్ని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. ఆ భూముల బదలాయింపుతో పాటు గాంధీ సరోవర్ నిర్మాణం, మూసీ సీవరేజీ ప్రాజెక్టులు, 11 హెరిటేజ్ వంతెనల నిర్మాణంతో పాటు ఇతర పనులకు రూ.14,100 కోట్లు వ్యయమవుతాయని అంచనా వేశామని, నిధుల మంజూరుతో పాటు అనుమతులకు సహకరించాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు.

మూసీ పునరుజ్జీవంలో భాగంగా గోదావరి నీటిని మూసీకి తరలించేందుకు, గోదావరి నుంచి నగరానికి 15 టీఎంసీలను హైదరాబాద్ తాగు నీరు అవసరాలకు తరలించేందుకు రూ.7,440 కోట్లతో ప్రణాళికలు రూపొందించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలియజేశారు. ఆ మొత్తం విడుదలకు సహకరించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు.

హైదరాబాద్ నగరంతో పాటు సమీప 27 మున్సిపాలిటీల్లో 7,444 కి.మీ.మేర సీవరేజీ నెట్‌వర్క్ పనులకు రూ.17,212.69 కోట్లతో సమగ్ర సీవరేజీ మాస్టర్ ప్లాన్ రూపొందించామని, అమృత్ 2 లేదా ప్రత్యేక ప్రాజెక్టు కింద దానిని చేపట్టేందుకు సహకరించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. అలాగే తెలంగాణలో రెండో పెద్ద నగరమైన వరంగల్ లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ ప్లాన్‌ను రూపకల్పన చేశామని, రూ.4,170 కోట్ల వ్యయమయ్యే ఈ ప్లాన్‌ను అమృత్ 2 లేదా ప్రత్యేక పథకం కింద చేపట్టాలని సీఎం కోరారు. సెమీకండక్టర్ల ప్రాజెక్టులకు హైదరాబాద్ అనువుగా ఉందని, నిపుణులైన కార్మికులు, మౌలిక వసతుల అభివద్ధిలో రాష్ట్ర ప్రభుత్వం చూపుతున్న శ్రద్ధను పరిగణనలోకి తీసుకొని తెలంగాణను సెమీకండక్టర్ మిషన్ లో చేర్చాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణకు కేంద్రీయ విద్యాలయాలు కేటాయించాలని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఇటీవల రాష్ట్రానికి ఏడు నవోదయ విద్యాలయాలు కేటాయించినందుకు కేంద్ర మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. అదే సమయంలో రాష్ట్రానికి ఒక్క కేంద్రీయ విద్యాలయం కూడా కేటాయించలేదని, కేంద్రీయ విద్యాలయాలతో పాటు నవోదయ పాఠశాలలు లేని జిల్లాలకు వాటిని కేటాయించాలని కోరారు. డీమ్డ్ యూనివర్సిటీల ప్రకటనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతి తప్పనిసరి అని, కానీ ఇటీవల కేంద్ర ప్రభుత్వ అనుమతితోనే డీమ్డ్ యూనివర్సిటీలను గుర్తిస్తోందని సీఎం కేంద్ర మంత్రి దష్టికి తీసుకెళ్లారు. డీమ్డ్ యూనివర్సిటీ గుర్తింపునకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్ఓసీ తీసుకునేలా చూడాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు.

తక్షణం విచారణ జరిపి నివేదిక ఇవ్వండి

- రైతుకు బేడీలు వేసిన ఘటనపై సిఎం ఆగ్రహం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికారాబాద్ జిల్లా లగచర్లకు చెందిన రైతు హీర్యానాయక్‌ను చికిత్స కోసం జైలు నుంచి సంగారెడ్డి ఆస్పత్రికి బేడీలతో తీసుకెళ్లడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనకు సంబంధించి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతుకు బేడీలు వేసి తీసుకెళ్లాల్సినంత అవసరం ఏమొచ్చిందని అధికారులపై సీరియస్ అయ్యారు. ప్రజా ప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించబోదని స్పష్టం చేశారు. ఈ ఘటనపై తక్షణం విచారణ జరిపి నివేదిక సమర్పించాలని ఉన్నతాధికారులను సిఎం ఆదేశించారు. లగచర్ల భూసేకరణ సందర్భంగా కలెక్టర్‌పై దాడి కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న హీర్యానాయక్‌కు సంగారెడ్డి జైలులో వైద్య పరీక్షలు చేసే సమయంలో ఛాతినొప్పి వచ్చింది. దీంతో అతన్ని మొదట సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ హీర్యానాయక్‌కు గుండెపోటు రావడంతో వెంటనే పంజాగుట్ట నిమ్స్‌కు తరలించారు.



తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్న రైతులు

రుణమాఫీ పూర్తి చేసే వరకూ పోరాడాలి

- తెలంగాణ రైతు సంఘం నేత మాదినేని రమేష్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రుణమాఫీ పూర్తి చేసే వరకు పోరాడాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా తల్లాడ మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ముందుగా సిపిఎం కార్యాలయం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ధర్నా అనంతరం కార్యాలయంలోని యుడిసి స్టాలిన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నాలుగు విడతల రుణమాఫీలో 50 శాతం కూడా జిల్లాలో రైతుల రుణాలు మాఫీ చేయలేదన్నారు. జిల్లాలో లక్ష మంది రైతులకు పైగా రుణమాఫీ కాలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రెండు లక్షల రూపాయల రుణమాఫీ ప్రక్రియ పూర్తైనట్టుగా ప్రకటన చేయడం హాస్యాస్పదమన్నారు. ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ అనుసంధానంతో జరిగిన తప్పులు, ఇంటి పేర్లు, రైతుల పేర్లు, ఆధార్ కార్డులో ఉన్న పేరు సరిపోల్చలేదని టెక్నికల్ సమస్యల పేరుతో వేలాది మంది రైతుల రుణమాఫీ చేయలేదని ఆరోపించారు. బ్యాంకులో రుణం పొందినప్పుడు పట్టాదారు పాస్ పుస్తకం కలిగి, ప్రస్తుతం పట్టాదారు పాస్ పుస్తకం లేని రైతులకూ రుణమాఫీ చేయలేదని తెలిపారు. రైతు మరణించి ఉంటే అలాంటి వారికి కూడా రుణమాఫీ వర్తించలేదన్నారు. రుణమాఫీలో సమస్యలకు బ్యాంక్ అధికారులు, వ్యవసాయ అధికారుల తప్పిదంగా ప్రభుత్వం వారిపై మోపి సమస్య నుంచి తప్పుకోవాలని చూస్తుందని ఆరోపించారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు తాతా భాస్కర్‌రావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ప్రజా వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడి ఇంటి బాట పట్టిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే బాటలో వెళ్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి శీలం సత్యనారాయణ రెడ్డి, నాయకులు శీలం పకీరమ్మ, పులి వెంకట నరసయ్య, కల్యాణం కృష్ణయ్య, నల్లమోతు మోహన్‌రావు, మొన్నేపల్లి అర్జున్‌రావు, పులి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పిచ్చగుంట్ల పదాన్ని తొలగించాలి

హైదరాబాద్ బ్యూరో : తమ సామాజిక తరగతిలో ఉన్న కొన్ని పదాలను తొలగించాలని దొమ్మర, వంశరాజ్, తమ్మలి కుల సంఘాల ప్రతినిధులు రాష్ట్ర బిసి కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. గురువారం హైదరాబాద్‌లో ఆ చైర్మన్‌ను ఆయా సంఘాల నేతలు కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. దొమ్మర సామాజిక తరగతికి చెందిన వారు తమ కులం పేరును గడ వంశీగా మార్చాలని విజ్ఞప్తి చేశారు. వంశరాజ్ కులం వారు తమ కులం పేరులో నుంచి పిచ్చగుంట్ల అనే పదాన్ని తొలగించాలని కోరారు. తమ్మలి కులం నుంచి నాన్ బ్రాహ్మిణ్, శూద్రా కుల పదాలను తొలగించాలని కోరారు. ఈ పదాలతో తాము సమాజంలో అనేక అవమానాలను ఎదుర్కొంటు న్నామనిఆరే రాములు, మురళి కృష్ణ, వట పత్ర సాయి ఆవేదన వ్యక్తం చేశారు. వినతి పత్రం స్వీకరించిన వారిలో కమిషన్ చైర్మెన్ నిరంజన్ సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, డిప్యూటీ డైరెక్టర్ యు శ్రీనివాసరావు, స్పెషల్ ఆఫీసర్ జి సతీష్ కుమార్, రిసెర్చ్ ఆఫీసర్ లక్ష్మి నారాయణ పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లు.. పెట్టుబడిదారుల కోసమే

- లేబర్ కోడ్‌ల రద్దు కోసం కార్మిక వర్గం పోరాడాలి
- సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్
- "లేబర్ కోడ్‌లు-కార్మిక వర్గ కర్తవ్యం"పై సెమినార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లు పెట్టుబడిదారుల కోసమేనని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ అన్నారు. జనవరిలో జరగనున్న సిపిఎం రాష్ట్ర 4వ మహాసభల పురస్కరించుకొని గురువారం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పట్టణంలోని ఐలాభవన్‌లో "లేబర్ కోడ్‌లు- కార్మిక వర్గ కర్తవ్యం" అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాలన్నింటినీ రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకురావడం వెనుక కార్పొరేట్లు, పెట్టుబడిదారుల లాభాలు దాగున్నాయని, వాటిని వెంటనే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లోబర్ కోడ్‌ల వల్ల భవిష్యత్తులో కార్మికులు తమ హక్కులను కోల్పోతారని, పరిశ్రమలను ఎప్పుడైనా మూసుకోవచ్చని, కార్మికులను ఇష్టానుసారంగా తొలగించవచ్చని, కార్మిక హక్కులపై ఎటువంటి పర్యవేక్షణ చేసే అధికారులు, సిబ్బంది ఉండరని తెలిపారు. అలాగే పిఎఫ్, ఇఎస్ఐ, సంక్షేమ పథకాలూ వర్తించవని విమర్శించారు. వీటివల్ల కార్మికవర్గం తీవ్రంగా నష్టపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనం రోజుకు రూ.174 ఉండాలని మోడీ ప్రతిపాదించారని, దీంతో కుటుంబ జీవనం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. కార్మికులకు నష్టాన్ని చేకూర్చే లేబర్ కోడ్‌లను తిప్పికొడితేనే భవిష్యత్తు అని, దానికోసం కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. రైతాంగ పోరాటం స్ఫూర్తితో కార్మికులూ లేబర్ కోడ్‌లపై ఉద్యమించాలని తెలిపారు. అనంతరం సిపిఎం మహాసభల ఆహ్వాన సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున్, ఉపాధ్యక్షులు కె రాజయ్య, సిపిఎం నాయకులు పాండురంగారెడ్డి మాట్లాడారు. ఈ సెమినార్‌లో సిపిఎం నాయకులు నాగేశ్వరరావు, శాంత కుమార్, అనంత రావు, వాజిద్ అలీ, సంతోష్ కుమార్ గౌడ్, శ్రీకాంత్, మనోహర్, మురళి, శేషగిరి, శ్రీధర్, తిరుపతి, హరినాథ్, సురేష్, రామకృష్ణ, రాఘవేంద్ర, మల్లేష్, బంగారు రాజు పాల్గొన్నారు.



సెమినార్‌లో మాట్లాడుతున్న భూపాల్

ఎసిబి కస్టడిలో ఇరిగేషన్ అవినీతి ఎఇఇ

- కోట్లాది రూపాయల అక్రమార్జనపై ఆరా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కోట్లాది రూపాయల ఆదాయానికి మించి ఆర్జించిన నీటిపారుదల శాఖ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నిఖేశ్‌కుమార్‌ను ఎసిబి అధికారులు గురువారం కస్టడీలోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. ఇటీవలనే ఆదాయానికి మించి ఆస్తుల కేసులో నిఖేశ్‌కుమార్ ఎసిబి అధికారులు అరెస్టు చేశారు. ఆ సమయంలో నిఖేశ్‌కుమార్ ఆస్తుల సోదాల్లో బయటపడ్డ స్థిర, చరాస్తుల విలువను 17 కోట్ల 76 లక్షల రూపాయలుగా చూపారు. అయితే, దీని ప్రస్తుత మార్కెట్ విలువ వందల కోట్ల రూపాయల్లో ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే, కోట్లాది రూపాయల అక్రమాస్తులను నిఖేశ్ గడించిన తీరును బయటపెట్టడానికి గానూ అతన్ని తమ కస్టడీకి ఇవ్వాలంటూ ఎసిబి కోర్టును దర్యాప్తు అధికారులు అర్జించారు. దీనిపై స్పందించిన కోర్టు నాలుగు రోజుల పాటు కస్టడీకి ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు చంచల్‌గూడ జైలు నుంచి నిఖేశ్‌కుమార్‌ను ఎసిబి అధికారులు కస్టడీలోకి తీసుకుని బంజారాహిల్స్‌లోని తమ కార్యాలయానికి తరలించి ప్రశ్నిస్తున్నారు.

హిమాయత్‌సాగర్ చెరువు కబ్జాలపై హైడ్రా ఫోకస్

- చెరువులోని ఫంక్షన్ హాల్‌ను పరిశీలించిన కమిషనర్ రంగనాథ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లాలోని జంట జలాశయమైన హిమాయత్‌సాగర్ చెరువుపై హైడ్రా ఫోకస్ పెట్టింది. గురువారం హిమాయత్‌సాగర్ చెరువు ప్రాంతాన్ని హైడ్రా కమిషనర్ రంగనాథ్, ఇతర అధికారులతో కలిసి పరిశీలించారు. హిమాయత్ సాగర్ చెరువు స్థలంలో ఓ వ్యక్తి ఫంక్షన్ హాల్ ఏర్పాటుచేశారు. శంషాబాద్ మండలం కొత్వాల్‌గూడ గ్రామ పరిధిలోని హిమాయత్‌సాగర్ చెరువు స్థలంలో అక్రమంగా మట్టి పోసి పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఈ విషయాలపై స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దాంతో హైడ్రా కమిషనర్ కబ్జాకు గురైన స్థలంతోపాటు ఫంక్షన్‌హాల్ నిర్మించిన స్థలాన్ని పరిశీలించారు. వీటిపై పూర్తి నివేదిక అందించాలనిఅధికారులను కమిషనర్ ఆదేశించారు.

చిన్నప్పటి నుంచే సమానత్వ మనస్తత్వాన్ని పెంపొందించాలి

- ఐటిసి క్వీన్ ఈక్విల్ మిషన్‌లో సానియా మీర్జా

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో



చిన్నవయస్సు నుంచే సమానత్వం మనస్తత్వాన్ని పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రముఖ టెన్నిస్ క్రీడాకారిణి సానియా మీర్జా అన్నారు. గురువారం హైదరాబాద్ క్లీన్ ఈక్వల్ మిషన్ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన సానియా మీర్జాతో పాటు ఐటిసి లిమిటెడ్ మార్కెటింగ్, పర్సనల్ కేర్ ప్రొడక్ట్స్ బిజినెస్ వైస్ ప్రెసిడెంట్ సంజయ్ శ్రీనివాస్, గీతాంజలి దేవ్‌శాల ప్రిన్స్‌పల్, గీతాంజలి గ్రూపు విద్యా సంస్థల డైరెక్టర్ మాధవి చంద్ర, కిరణ్మయి చౌదరి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సానియా మీర్జా మాట్లాడుతూ.. ఐటిసి నిమైల్ క్లీన్ ఈక్వల్ మిషన్‌లో భాగంగా ఉండడాన్ని తాను గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. ఇది భాగస్వామ్య బాధ్యత భావాన్ని పెంపొందించడం, ఆకట్టుకునే విధంగా చిన్న వయస్సు నుంచే సమానత్వం మనస్తత్వాన్ని పెంపొందించడానికి సంబంధించిన అంశం అని చెప్పారు.

సంగారెడ్డి సెంట్రల్ జైల్లో లగచర్ల రైతుకు గుండెపోటు

- ఇంటి వద్ద ఉన్నపుడే అనారోగ్యం
- బేడీలతో ఆస్పత్రికి తరలింపు
- అధికారుల తీరుపై సిఎం సీరియస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫార్మా సిటీ భూ సేకరణ కోసం వెళ్లిన కలెక్టర్‌పై జరిగిన దాడి ఘటన కేసులో అరెస్టయి సంగారెడ్డి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న లగచర్ల రైతుకు గుండెపోటు వచ్చింది. రైతు ఈర్యా నాయక్ జైల్లో అనారోగ్యం పాలవడంతో వైద్య పరీక్షలు చేస్తుండగా గుండెపోటు వచ్చిందన్న విషయం గుర్తించారు. దాంతో జైలు సిబ్బంది బుధవారం రాత్రి హుటాహుటిన సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే మూడ్రోజుల ముందే ఛాతీలో నొప్పిగా ఉందని చెప్పడంతో సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లిన జైలు సిబ్బంది వైద్య పరీక్షలు చేయించి తీసుకువచ్చారు. మళ్లీ బుధవారం రాత్రి ఛాతీలో నొప్పి వస్తుందని చెప్పడంతో సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లడంతో వైద్యులు ఈర్యా నాయక్‌కు ఇసిజి, 2 డీ ఏకో పరీక్షలు చేశారు. గత నెల 11న వికారాబాద్ జిల్లా లగచర్లలో కలెక్టర్‌పై దాడి కేసులో రిమాండ్‌లో ఉన్న ఖైదీ ఈర్యాకు గతంలోనే తనకి గుండె సమస్య ఉన్నట్టు వెల్లడించారు. మూడు నెలల కిందే ఇంటి వద్ద ఆస్పత్రికి వెళ్లగా స్టంట్ వేయాలని వైద్యులు చెప్పారని, తన ఆర్థిక పరిస్థితుల వల్ల సర్జరీ చేయించుకోలేదని తెలిపారు.



రైతును బేడీలతో ఆస్పత్రికి తీసుకెళుతున్న పోలీసులు

రైతుకు బేడీలేయడం పట్ల సిఎం సీరియస్

రిమాండ్ ఖైదీగా లగచర్ల రైతు ఈర్యా నాయక్ గుండెపోటు వస్తే అతనికి ఖైదీకి వేసిన మాదిరిగా బేడీలు వేసి ఆస్పత్రికి తీసుకెళ్లారు. బేడీలతో ఆస్పత్రిలో చేరిన విషయం మీడియాలో రావడంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పందించారు. ఘటనపై అధికారుల ద్వారా సమాచారం తెలుసుకొని జైలు అధికారులపై సీరియస్ అయ్యారు. రిమాండ్ ఖైదీకి బేడీలు వేయాల్సిన అవసరం ఏముందని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. నిందితునికి గుండెపోటు వచ్చి చావు బతుకుల మధ్య ఉంటే కనీసం రైతు అని కూడా చూడకుండా, కరుడుగట్టిన నేరస్తుని మాదిరి సంకెళ్ల వేయడం పట్ల విపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. సిఎం రేవంత్ రెడ్డి మాత్రం జైలు సిబ్బంది తీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఘటనపై విచారణ జరిపి పూర్తి స్థాయి నివేదిక సమర్పించాలని ఉన్నతాధికారులను అదేశించారు. ప్రజా ప్రభుత్వం ఇలాంటి చర్యలను సహించదని సిఎం ఈ సందర్భంగా హెచ్చరించారు.

రైతుకు సంకెళ్లు సరికాదు : చింత ప్రభాకర్, సంగారెడ్డి ఎమ్మెల్యే

లగచర్ల రైతుకు గుండెపోటు వచ్చి చావు బతుకుల్లో ఉంటే సంకెళ్ల వేసి ఆస్పత్రికి తీసుకెళ్లడం దారుణమని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు. సంఘటన తెలవగానే ఆయన ఆస్పత్రికి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు ఆడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా పాలన అంటే రైతులను జైల్లో పెట్టడం, సంకెళ్ల వేయడమా అని ప్రశ్నించ్చారు.

లగచర్ల రైతుకు బేడీలు వేయటం అన్యాయం : గొల్లపల్లి జయరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి

రైతుకు బేడీలు వేయటం అన్యాయం. లగచర్ల దాడి కేసులో సంగారెడ్డి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న రైతుకు ఛాతీనొప్పి వస్తే కనీస మానవత్వం లేకుండా బేడీలు వేసి తీసుకెళ్లడం దారుణం. రైతు ఈర్యా నాయక్‌కు మెరుగైన వైద్యం అందించాలి. ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

రంగమణి అర్ధశతాబ్ది మహా నాట్య మహోత్సవం కన్నుల పండుగ

ప్రజాశక్తి కల్చరల్

ప్రసిద్ధ నాట్యగురు సిఆర్ ఆచార్యులు వారసురాలిగా కూచిపూడి, ఆలయ సాంప్రదాయ నాట్యాలకే అంకితమై ఎందరో శిష్య ప్రశిష్యులను తీర్చిదిద్దిన వోలేటి రంగమణి సంప్రదాయ కళను పరిరక్షిస్తున్నారు అని వక్తలు ప్రశంసించారు. గురువుగా ఐదు దశాబ్దాల వోలేటి రంగమణి నాట్య సేవకు శిష్యులంతా కలసి చేసిన మహా నాట్యారాధన మహోత్సవం కనుల పండువగా జరిగింది. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, అభినయ దర్పణ ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో జరిగిన ఈ వేడుకలో వందలాది శిష్యులు పాల్గొని గురు సత్కారం చేశారు. వినాయక స్తుతితో కూచిపూడి నత్యాంశాలు ప్రారంభించి సంధ్యా తాండవం, మండోదరి శపథం ఆర్ధవంతంగా ప్రదర్శించి అభినందనలు అందుకున్నారు. శ్రీనిక రెడ్డి ప్రదర్శించిన అలమేలు మంగ ప్రవేశ దరువు ప్రత్యేకంగా ఆకట్టుకుంది. చిట్టోజు ప్రవల్లిక పార్వతీ ప్రవేశ దరువుతో, చింతారెడ్డి మధుమిత అరుదైన జానపద కూచిపూడి సమ్మిళిత జక్కుల కాంత దరువుతో అలరించారు. వర్ణం అంశంలో వైష్ణవి వైవిధ్య నృత్యం కళ్లను కట్టిపడేసింది. చివరగా ప్రదర్శించిన సింహనందిని నృత్యం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. వోలేటి రంగమణి నృత్య దర్శకత్వం, కుమార్తె వోలేటి రేఖతో కలసి నట్టువాంగం చేయగా, డి.యస్. వి శాస్త్రి గాత్ర సహకారం అందించారు. మృదంగంతో రాజగోపాలాచార్యులు, వయోలిన్ తో దినకర్, వేణువుతో ఉమా వెంకటేశ్వర్లు రక్తి కట్టించారు. పిఎం కె గాంధీ వ్యాఖ్యానం చేశారు . ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ సాహితీవేత్త డాక్టర్. వోలేటి పార్వతీశం మాట్లాడుతూ నాట్య అర్ధశతాబ్ది నిర్వహించుకునే అదష్ట భాగ్యం కొందరికే దక్కుతుందని, అందులో మేటి గురువు రంగమణి అని అభినందించారు. సాంస్కతిక శాఖ సంచాలకులు డాక్టర్ . మామిడి హరికృష్ణ, సినీ దర్శకుడు శివ నాగేశ్వరరావు, ఆధ్యాత్మికవేత్త డా. అనంతలక్ష్మి, నాట్య గురువులు ఆర్ ప్రసన్నరాణి,

అత్యాధునిక ఎవి ఉత్పత్తుల ఆవిష్కరణ

- సెన్‌హైజర్, క్రెస్ట్రోన్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమావేశాల నిర్వహణలో అత్యాధునిక ఆడియో, వీడియో టెక్నాలజీ ఉత్పత్తులను అందుబాటులోకి తెచ్చినట్లు ప్రముఖ ఆడియో టెక్నాలజీలో గ్లోబల్ లీడర్ అయిన సెన్‌హైజర్, వీడియో కాన్ఫరెన్సింగ్ సొల్యూషన్స్ సంస్థ క్రెస్టాన్ సంస్థలు సంయుక్తంగా ప్రకటించాయి. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సెన్‌హైజర్ ఇండియా సేల్స్ డైరెక్టర్ నవీన్ శ్రీధరా, క్రెస్ట్రోన్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ గగన్ వర్మ మాట్లాడుతూ.. భారత్‌లో ఆడియో, వీడియో పరిశ్రమ 30-40 శాతం వృద్ధిని నమోదు చేస్తుందన్నారు. సెన్‌హైజర్ టీమ్‌కనెక్ట్ ఫ్యామిలీలో భాగంగా ట్రూ వాయిస్‌లిఫ్ట్ సొల్యూషన్‌లను అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రొఫెషనల్ సెట్టింగ్‌లలో మెరుగైన కమ్యూనికేషన్ కోసం ఇవి దోహదం చేయనున్నాయన్నారు. అదనపు మైక్రోఫోన్‌ల అవసరం లేకుండా గది అంతటా స్పష్టమైన ఆడియోను అందిస్తాయన్నారు.

పిఎంఎవై కింద తక్షణ రుణాలు

- ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్

ప్రధాన్ మంత్రి ఆవాస్‌యోజన- అర్బన్ 2.0 ద్వారా హైదరాబాద్‌లో గృహ రుణాలను మరింత సులభంగా అందించనున్నట్లు ఆధార్ హౌసింగ్ ఫైనాన్స్ ఎండి, సిఇఒ రిషి ఆనంద్ తెలిపారు. పిఎంఎవై-యు 2.0పై అవగాహన పెంపొందించడానికి డిసెంబర్ 12 నుంచి 15 మధ్య తమ శాఖ కార్యాలయాల్లో తక్షణ మంజూరు క్యాంప్‌ను ఏర్పాటు చేస్తోన్నట్లు పేర్కొన్నారు. దీన్ని హైదరాబాద్ సహా మహబూబ్‌నగర్, వనపర్తి, షాద్‌నగర్‌ల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. సొంత ఇంటి కొనుగోలు కలను సహకారం చేయడంలో సహాయపడుతామన్నారు. పిఎంఎవై కింద రూ.1.80 లక్షలు వరకు సబ్సిడీని పొందవచ్చన్నారు.

సిడిఎంతో రెండు దశాబ్దాల అనుబంధం

హైదరాబాద్ బ్యూరో : మేనేజ్‌మెంట్ డెవలప్‌మెంట్, లీడర్‌షిప్ అంశాల్లో పేరుగాంచిన ద హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (హెచ్‌ఎంఎ) సీనియర్ ఆర్మీ అధికారుల కోసం ప్రత్యేకంగా ఒక సెషన్ నిర్వహించింది. బేగంపేటలోని ఓ హోటల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ప్రఖ్యాత కాలేజ్ ఆఫ్ డిఫెన్స్ మేనేజ్‌మెంట్ (సిడిఎం)కు చెందిన సీనియర్ అధికారులు ఇందులో హెచ్‌ఎంఎ, సిడిఎంల మధ్య రెండు దశాబ్దాలకు పైగా ఉన్నఅనుబంధంతో విజ్ఞానాన్ని పంచుకోవడం, నాయకత్వ స్థానాల్లో మరింత ఉన్నతి సాధించడం కొనసాగు తున్నాయని హెచ్‌ఎంఎ అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. "ధైర్యవంతులు, నిస్వార్థపరు లైన సైన్యాధికారులు పాల్గొన్న ఈ సభను ఉద్దేశించి ప్రసంగించడం నాకు ఎంతో గౌరవంగా ఉంది.

చాట్‌జిపిటి సేవల్లో అంతరాయం

న్యూఢిల్లీ : కృత్రిమ మేధా (ఎఐ) బెస్ట్ చాట్‌బోట్ చాట్‌జిపిటి సేవల్లో అంతరాయం ఏర్పడింది. ఫలితంగా గురువారం తెల్లవారుజామున లక్షలాది మంది ఖాతాదారులు చాట్‌జిపిటి సేవలు లభించక పోవడంతో ఇబ్బందుల పాలవుతున్నారు.చాట్‌జీపీటీతోపాటు సంస్థకు చెందిన ఎపిఐ, సోరా సేవల్లో ఈ సమస్య తలెత్తిందని ఓపెన్ ఎఐ తెలిపింది.

ధరణి సేవలు తాత్కాలికంగా నిలిపివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డేటాబేస్ వెర్షన్ అప్‌డేట్ కారణంగా ధరణి పోర్టల్ సేవలు తాత్కాలికంగా ఆగిపోయాయి. గురువారం సాయంత్రం ఐదు గంటల నుంచి ఈ పోర్టల్ సేవలను రాష్ట్ర ప్రభుత్వం నిలిపి వేసింది. నాలుగు రోజుల అనంతరం ఈ నెల 16 నుంచి తిరిగి ధరణి ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రానున్నట్టు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

మాజీ మంత్రుల అరెస్టు

- తాండూర్ వెళ్తుండగా అడ్డుకున్న పోలీసులు
- చంగముల్ పిఎస్‌కు సబితా ఇంద్రారెడ్డి, సత్యావత్ రాథోడ్
- నవాబుపేట పిఎస్‌కు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వికారాబాద్ జిల్లా తాండూర్ గిరిజన గురుకుల బాలికల హాస్టల్‌లో ఫుడ్ పాయిజన్‌కు గురైన విద్యార్థినులను పరామర్శించడానికి వెళ్లి మాజీ మహిళా మంత్రులు, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. మంగళవారం గిరిజన హాస్టల్‌లో 15 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. వీరిని పరామర్శించడానికి గురువారం బిఆర్ఎస్ నేతలు వెళ్లగా.. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఎన్నెపల్లిలో (హైదరాబాద్-తాండూర్ రహదారిపై) మర్రి చెన్నారెడ్డి విగ్రహం దగ్గర పోలీసులు అడ్డుకున్నారు. హాస్టల్ దగ్గరకు వెళ్లడానికి అనుమతి లేదని నిరాకరించారు. ఈ క్రమంలో బిఆర్ఎస్ నేతలకు, పోలీసులకు మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. తమను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ బిఆర్ఎస్ నాయకులు రోడ్డుపై బైటాయించారు. దాంతో పోలీసులు మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ సత్యవతిరాథోడ్‌ను అరెస్టు చేసి చంగముల్ పిఎస్‌కు తరలించారు. మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు మెతుకు ఆనంద్‌తోపాటు మరికొందరిని నవాబుపేట పిఎస్‌కు తరలించారు.

చంగముల్ పిఎస్ వద్ద హైడ్రామా..

అరెస్ట్ చేసిన సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్‌ను పూడూరు మండలం చంగముల్ పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. వీరిని తీసుకొస్తున్నారన్న విషయం స్థానిక పోలీసులకు తెలియడంతో పోలీస్‌స్టేషన్‌కు ఫిర్యాదు చేయడానికి వచ్చిన వారందరినీ బయటకు పంపించి, పెద్ద ఎత్తున పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి గేట్లు మూసివేశారు. మాజీ మహిళా మంత్రులు పిఎస్‌కు రాగానే అక్కడున్న పత్రికా విలేకరులు ఫోటోలు తీస్తుండగా పోలీసులు మీడియాకు అనుమతి లేదంటూ అడ్డుకున్నారు. దాంతో విలేకరులు పోలీసులను నిలదీశారు. బిఆర్ఎస్ నాయకుల అరెస్టును కవర్ చేయాల్సిన బాధ్యత తమపై ఉందని చెప్పడంతో అక్కడే ఉన్న సబితా ఇంద్రారెడ్డి స్పందిస్తూ.. 'అవసరమైతే మీడియాను కూడా అరెస్టు చేస్తారేమో.. జాగ్రత్తగా ఉండండి' అని చెప్తూ పిఎస్ లోపలికి వెళ్లిపోయారు. కొద్దిసేపు పోలీస్ స్టేషన్‌లో వారిని కూర్చోబెట్టి వదిలేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రులు మాట్లాడుతూ.. తాము హాస్టల్ దగ్గరకు వెళ్తే మీ బండారం బయటపడుతుందని భయపడుతున్నారా.. అంటూ రాష్ట్రప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మధ్య గురుకులాల్లో వరుసగా ఫుడ్ పాయిజన్ ఘటనలు జరగడం వెనక ప్రభుత్వ వైఫల్యం ఉందన్నారు. విద్యార్థినులకు హాస్టల్‌లోనే వైద్యం చేయడం ఏంటనీ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌ను ప్రశ్నించారు. కలెక్టర్ దీనికి సమాధానం చెప్పాలన్నారు. పిల్లల విషయంలో రాజకీయం చేయాల్సిన అవసరం తమకు లేదని తెలిపారు. ఫుడ్ పాయిజన్‌కు బిఆర్ఎస్ పార్టీ, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కారణం అంటూ నింద మోపడం సిగ్గుచేటన్నారు. విద్యార్థుల సమస్యలు తెలుసుకునేందుకు వెళ్తున్న మమ్మల్ని పోలీసులు అనవసరంగా అడ్డుకొని ప్రజాసామ్యానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు.


సబితా ఇంద్రారెడ్డి, సత్యావత్ రాథోడ్‌ను అడ్డుకుంటున్న పోలీసులు

తాండూర్ కోర్టులో బిఆర్ఎస్ లీగల్ సెల్ పిటిషన్

ఫుడ్ పాయిజన్ ఘటనకు కారణమైన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ లీగల్ సెల్ నాయకులు తాండూరు న్యాయస్థానాన్ని కోరారు. ఈ ఘటనపై లీగల్ సెల్ నాయకులు కె గోపాల్, నరుకుల నరేందర్‌గౌడ్ తాండూర్ కోర్టులో పిటిషన్ వేశారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని బాధలను న్యాయమూర్తికి వివరించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని, అస్వస్థతకు గురైన వారికి మెరుగైన వైద్యం అందించాలని పిటిషన్‌లో కోరినట్టు న్యాయవాదులు తెలిపారు.

ఒకరికి బదులు మరొకరు రాసిన పరీక్ష

- రూ.10,000 జరిమానా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఓపెన్ 10వ తరగతి పరీక్షల్లో ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాయడంతో రూ.10వేలు జరిమానా విధించినట్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి రామకృష్ణ గురువారం తీర్పునిచ్చారు. 2017 ఏప్రిల్ 17వ తేదీ టిఎస్ మోడల్ స్కూల్‌లో ఎండి ఫయాజుద్దీన్‌కు బదులు ఎండి ముమీత్ పరీక్ష రాస్తున్నట్టు డ్యూటీ సూపరింటెండెంట్‌కు తెలియగా.. ఎస్‌హెచ్‌ఒకు ఫిర్యాదు చేశారు. ఆ పరీక్ష ప్రతులను ఓపెన్ స్కూల్ హైదరాబాద్ డైరెక్టర్‌కు సైతం పంపారు. చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కేసు నమోదు కాగా విచారణలో భాగంగా ఇద్దరికీ జరిమానా విధించినట్టు అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ తీర్పు వెల్లడించారు.

విధుల నుంచి తొలగింపు ఆలోచన విరమించాలి

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లను విధుల నుంచి తొలగించాలన్న ప్రభుత్వ ఆలోచనను విరమించుకోవాలని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకవేళ ప్రభుత్వం గనుక ఆశా వర్కర్లను విధుల నుంచి తొలగిస్తే మరో పోరాటం తప్పదని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ తమకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, తమ డిమాండ్లను పరిష్కరించాలని ఆశావర్కర్లు కోరుతున్నారని తెలిపారు. అయితే ఆందోళన చేస్తున్న ఆశా వర్కర్లను విధుల నుంచి తొలగించాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు తమ వద్ద నిర్దిష్టమైన సమాచారం ఉందని పేర్కొన్నారు.

ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ముగ్గురు సభ్యుల కమిటీ

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిఎం ప్రజావాణి ప్రత్యేక చొరవతో ఆర్‌టిసి కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం త్రీ సభ్య కమిటీ ఏర్పాటు చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసిందని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి చిన్నారెడ్డి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. చిన్నచిన్న తప్పుల (స్టాప్‌లో బస్సు ఆపలేదు..సెల్‌ఫోన్ మాట్లాడడం)ను చూసి ఆర్‌టిసి యాజమాన్యం వారిని సర్వీస్ నుంచి తొలగించడంపై కార్మికులు సిఎం ప్రజావాణి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయాన్ని సిఎం రేవంత్‌రెడ్డికి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వివరించగా.. రాష్ట్ర ప్రభుత్వం త్రిసభ్య కమిటీని నియమించిందని తెలిపారు. ఆ కమిటీకి చైర్మన్‌గా కార్మిక, ఉపాధి, శిక్షణ, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి సంజయ్ కుమార్, మెంబర్ కన్వీనర్‌గా ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ విసి సజ్జనార్, సభ్యులుగా సెర్ప్ సిఇఒ దివ్య ఉంటారని తెలుపుతూ రాష్ట్ర రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. కమిటీ వేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. సిఎం రేవంత్‌రెడ్డికి, మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సంతోష్ ట్రోఫీ పోస్టర్‌ను అవిష్కరించిన సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లో శనివారం నుంచి ప్రారంభం కానున్న సంతోష్ ట్రోఫీ పోస్టర్‌ను సిఎం రేవంత్ రెడ్డి గురువారం ఢిల్లీలోని తన నివాసంలో ఆవిష్కరించారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మెన్ శివసేనారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్, జి వంశీ రాష్ట్ర ప్రభుత్వ క్రీడల సలహాదారులు జితేందర్ రెడ్డి, ఖైరతాబాద్ డిసిసి అధ్యక్షులు డాక్టర్ రోహిన్ రెడ్డి పాల్గొన్నారు. 57 ఏళ్ల తర్వాత హైదరాబాద్‌లో చారిత్రాత్మకమైన ఫుట్ బాల్ సంతోష్ ట్రోఫీకి ఆతిథ్యం ఇవ్వడం సంతోషమని సిఎం చెప్పారు. ఈ నెల 14 నుండి 31 వరకు వివిధ రాష్ట్రాల 37 జట్లు పాల్గొంటున్నారని, అందుకు తగిన ఏర్పాట్లు పూర్తయినట్టు స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న చాడ వెంకట్ రెడ్డి

అదాని వ్యవహారంపై మోడీ సమాధానం చెప్పాలి : చాడ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అదానీ వ్యవహారంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దేశ ప్రజలకు సమాధానం చెప్పాలని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో గురువారపాయన సిపిఐ జిల్లా కార్యదర్శి తాండ్ర సదానంద అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అదానీపై అమెరికా చేసిన ఆరోపణలకు ప్రధాని నరేంద్ర మోడీ సమాధానం చెప్పాలని, ఈ విషయమై కనీసం పార్లమెంటులో ప్రతిపక్షాలు చర్చకు పట్టుబట్టినా బిజెపి ప్రభుత్వం దాటవేసే ధోరణి అవలంబిస్తోందని అన్నారు. ఈ మొత్తం వ్యవహారంపై పార్లమెంట్‌లో చర్చ జరగాలని డిమాండ్ చేశారు. ఈనెల 26 నుంచి రాష్ట్రంలో నిర్వహించనున్న సిపిఐ 100 సంవత్సరాల ఉత్సవాలను జిల్లా కేంద్రంతోపాటు మండలాలు, గ్రామాల్లో ఘనంగా నిర్వహించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గోశిక మోహన్, జిల్లా కార్యవర్గ సభ్యులు గౌతమ్ గోవర్ధన్, నాయకులు కె కనకరాజ్, తాళ్లపల్లి మల్లయ్య, ఓదెమ్మ, ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రీతం పాల్గొన్నారు.

సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మెకు సంపూర్ణ మద్దతు : సిఐటియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సమగ్ర శిక్షా ఉద్యోగులు చేస్తున్న సమ్మెకు సంపూర్ణ మద్దతు ఉంటుందని సిఐటియు రాష్ట్ర కమిటీ ప్రకటించింది. గురువారం ఈ మేరకు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అప్పటివరకూ పేస్కేల్ వర్తింపజేయాలనీ, ఆరోగ్యబీమా రూ.పది లక్షల సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. రిటైరైన ఉద్యోగులకు రూ.25 లక్షలు బెనిఫిట్స్ కింద ఇవ్వాలనీ, ప్రభుత్వ, విద్యా శాఖ నియామకాల్లో వారికి వెయిటేజీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పిటిఐలకు 12 నెలల వేతనం ఇవ్వాలని కోరారు. సమగ్ర శిక్షా ఉద్యోగులతో గత ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయించుకుందని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉద్యోగ భద్రత కల్పించి వేతనాలు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. రేవంత్‌రెడ్డి సర్కారు అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇప్పటి వరకూ వారి సమస్యలను పరిష్కరించకపోవడం దారుణమని పేర్కొన్నారు. సమస్య జఠిలం కాక ముందే రాష్ట్ర ప్రభుత్వం వారి సమస్యలను తక్షణం పరిష్కరించాలని కోరారు. ఈ సమ్మెకు రాష్ట్రంలోని యావత్ కార్మికవర్గం అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

తప్పులను కప్పిపుచ్చుకోవడానికి..

రాష్ట్రం అప్పుల పాలైందని కాంగ్రెస్ ప్రచారం

- ఆర్‌బిఐ రిపోర్టు సిఎం రేవంత్‌కు చెంపపెట్టు : హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తాము ఇచ్చిన హామీలను అమలు చేయలేక, రాష్ట్రం అప్పుల పాలైందని కాంగ్రెస్ పార్టీ తప్పుడు ప్రచారం చేస్తున్నదని, తెలంగాణ దివాళా తీసిన రాష్ట్రం కాదని, దివ్యంగా వెలుగుతున్న రాష్ట్రమని ఆర్‌బీఐ రిపోర్టు తేల్చి చెప్పిందని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. గురువారం సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అబద్ధాల పునాదులపై ఏర్పడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం అవే అబద్ధాలను ప్రచారం చేస్తూ కాలం గడుపుతున్నదన్నారు. నిజాన్ని అబద్ధంగా మార్చేందుకు కాంగ్రెస్ గ్లోబల్స్ ప్రచారం చేసిందన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నివేదికతో పదేండ్ల తెలంగాణ అభివృద్ధి, ఆర్థిక వృద్ధిపై కాంగ్రెస్ మంత్రులు, సిఎం రేవంత్ రెడ్డి చేస్తుంది దుష్ప్రచారమేనని తేలిపోయిందన్నారు. కెసిఆర్ సంపదను సృష్టించి పేదలకు పంచారన్నారు. పదేళ్ల పాలనలో కెసిఆర్ ప్రతి రంగాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించారని ఆర్‌బిఐ విడుదల చేసిన హ్యాండ్‌బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్-2024 నివేదికలోని గణాంకాలు కండ్లకు కట్టినట్టు చెప్తున్నాయని తెలిపారు. పదేండ్ల కేసీఆర్ పాలనలో జిఎస్‌డిపి, తలసరి ఆదాయం, విద్యుత్తు, సాగు విస్తీర్ణం, వ్యవసాయం, అటవీ విస్తీర్ణం, మూలధన వ్యయం, ఉపాధి అవకాశాలు ఇలా అన్నింటా తెలంగాణ రికార్డు సృష్టించిందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే తెలంగాణ అప్పుల కుప్ప అని రాష్ట్ర పరపతిని, పరువును దిగజార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తొమ్మిదిన్నరేళ్ల బిఆర్ఎస్ పాలనలో తెలంగాణ మొత్తం అప్పులు రూ. 7 లక్షల కోట్లకు చేరాయన్న రేవంత్ ప్రభుత్వ ప్రకటన వాస్తవదూరమని రుజువైందన్నారు. 2014-15లో తెలంగాణ మొత్తం రుణాలు రూ. 72,658 కోట్లు ఉండగా, 2024 మార్చి నాటికి ఈ రుణాల మొత్తం రూ. 3,22,499.20 కోట్లకు చేరినట్టు ఆర్‌బిఐ వెల్లడించిందన్నారు. బిఆర్ఎస్ హయాంలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కోసం చేసిమే ఈ అప్పు చేసినట్టు తెలిపారు. తెలంగాణ రాక ముందు రాష్ట్రం పరిస్థితి ఎట్లా ఉండేదో, ఇప్పుడు ఎలా ఉందో ఆర్‌బిఐ కళ్లు తెరిపించేలా చెప్పిందన్నారు. దేవాలయాలను కట్టడానికి రూ. 2,800 కోట్లు, రైతు బంధుకు రూ. 72,972 కోట్లు, రైతు బీమా రూ. 6,800 కోట్లు, రైతు రుణమాఫీ రూ. 29 వేల కోట్లు, ఉచిత కరెంట్‌కు రూ. 61వేల కోట్లు, గొర్రెల పంపిణీకి రూ. ఐదు వేల కోట్లు, ఆసరా పింఛన్లకు రూ. 61 వేల కోట్లు కేటాయించినట్టు చెప్పారు. అలాగే, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సచివాలయం, పటిష్టమైన భద్రత కోసం కమాండ్ కంట్రోల్ సెంటర్, జిల్లాకు ఒక మెడికల్ కాలేజీ, కలెక్టరేట్, ఎస్పీ ఆఫీస్, వెయ్యికి పైగా గురుకులాలు బీఆర్ఎస్ పాలనలోనే ఏర్పడ్డాయన్నారు. ఈ సమావేశంలో నాయకులు రాజనర్సు, సంపత్ రెడ్డి, మోయిజ్, గుండు భూపేష్ తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాల సలహా మండలిలో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలి

- సిఐటియు


ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కనీస వేతనాల సలహా మండలిలో అన్ని కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిఐటియు రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. అందులో ఐఎన్‌టియుసి, ఎఐటియుసికె ప్రాతినిధ్యం కల్పించడాన్ని తప్పుబట్టింది. గురువారం ఈ మేరకు సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. కార్మిక సంఘాల తరఫున ఐదుగురు, యాజమాన్యాల తరుపున ఐదుగురు, ఇద్దరు స్వతంత్రులతో కార్మిక శాఖ కమిటీ వేసిందనీ, ఆ బోర్డులో ఐఎన్‌టియుసి, ఎఐటియుసిలకు మాత్రమే ప్రాతినిధ్యం కల్పించడం సరిగాదని పేర్కొన్నారు. రాష్ట్రంలో 73 షెడ్యూల్డ్ ఎంప్లాయ్‌మెంట్స్‌లో కనీస వేతనాల సవరణ కోసం సిఐటియు పోరాటం చేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మూడు దఫాలుగా వేసిన సలహామండలిలో సిఐటియు ప్రాతినిధ్యం ఉండేదని తెలిపారు. కనీస వేతనాల సమస్య పట్ల గత ప్రభుత్వమైనా, ప్రస్తుత ప్రభుత్వమైనా యాజమాన్యాలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నదని విమర్శించారు. అందులో భాగంగానే కనీస వేతనాల సలహా మండలిలో సిఐటియుకి ప్రాతినిధ్యం లేకుండా చేసిందని పేర్కొన్నారు. కార్మికుల సమస్యలపై నికరంగా పోరాడుతున్న వారిని ప్రాతినిధ్యం ఇవ్వకపోవడం శోచనీయమని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పున:పరిశీలించి అన్ని కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం ఇవ్వాలని కోరారు.

గంజాయి చాక్లెట్స్ విక్రయదారుని అరెస్ట్

- 4.957 చాక్లెట్ల పట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



బీహార్ నుంచి గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బోడుప్పల్‌లో విక్రయిస్తున్న వ్యక్తిని ఎస్‌టిఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన మేడిపల్లి పిఎస్ పరిధిలో గురువారం జరిగింది. ఎస్‌టిఎఫ్ సిఐ సుభాష్ చందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన పండరీ అక్కడి నుంచి గంజాయి చాక్లెట్‌లు తీసుకొచ్చాడు. వాటిని బోడుప్పల్ గౌతంనగర్‌లోని పలు కంపెనీల్లో పనిచేసే వారికి విక్రయిస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు అతన్ని పట్టుకుని విచారించగా సుమారు 4,957 గంజాయి చాక్లెట్‌లు లభించాయి. బీహార్ నుంచి ఎవరికీ అనుమానం రాకుండా చాక్లెట్ల రూపంలో తీసుకొచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్టు ఒప్పుకున్నాడు. అనంతరం అతన్ని ఘటకేసర్ అబ్కారీ పోలీసులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు అఖిల్, వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ సుధాకర్, రవి, కిషన్‌రావు, సుధీష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కోమాలో నుంచి కోలుకున్న చిన్నారి అక్షర

- మెడికవర్‌లో వైద్యుల చికిత్స

ప్రజాశక్తి - బిజినెస్ బ్యూరో

పాఠశాలలో చదువుతున్న 12 ఏళ్ల అక్షర తరగతిలో నిద్రపోవడం గమనించిన టీచర్లు మొదట చిన్న పాప అన్నం తినడం వల్ల నిద్రవస్తుందేమో అని అనుకున్నారు. కానీ అలా తరుచు నిద్రపోవడం గమనించిన టీచర్లు ఆమె తల్లిదండ్రులకు ఈ విషయాన్నీ తెలియచేసి వెంటనే డాక్టర్‌ను సంప్రదించమని సూచించారు. వైద్యులను సంప్రదించగా అక్షరకు మెదడులో మెడులోబ్లాస్టోమా అనే మెదడు ట్యూమర్ ఉన్నట్టు తెలిసింది. ట్యూమర్ స్థానం క్లిష్టమైనదిగా ఉండటం వల్ల, ఆపరేషన్‌లో పక్షవాతం లేదా ప్రాణాపాయం వంటి సమస్యలు రావచ్చని వయసు రీత్యా చిన్న పాపా అవ్వడం చేయటానికి కూడా ముందుకు రాలేక పోయారు. అలాంటి సమయంలో మెడికవర్ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ న్యూరో అండ్ స్పైన్ సర్జన్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డిని సంప్రదించారు. "పరిస్థితిని పూర్తిగా విశ్లేషించిన డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి ఆపరేషన్ చేసి మొదట ట్యూమర్ గడ్డని తొలగించడం పాప ప్రాణాలను కాపాడటం జరిగింది. ట్యూమర్‌ను పూర్తిగా తొలగించగలిగారు. కానీ ఆపరేషన్ తరువాత అక్షర హైడ్రోసెఫలస్ అనే సమస్యకు గురైంది. దీనిని సరిచేయడానికి వెంట్రికులోపెరిటోనియల్ (విపి) షంట్ కోసం రెండవ సర్జరీ చేయాల్సి వచ్చింది. క్లిష్టమైన ఆపరేషన్ విజయవంతంగా పూర్తయిన తర్వాత, అక్షర మూడు నెలలపాటు కోమాలోకి వెళ్లింది. ఈ కఠిన పరిస్థితుల్లో డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, ఆయన బృందం నిరంతర చికిత్స అందించారు. ఒక రాత్రి, అక్షర ఆకస్మాత్తుగా మేల్కొని తన తండ్రితో మాట్లాడింది. ఆ తర్వాత తీసిన స్కాన్లు ఆమె పూర్తిగా కోలుకున్నదని నిర్ధారించాయి." అని మెడికవర్ హాస్పిటల్ వర్గాలు తెలిపాయి.

14 నుంచి చెకుముకి సైన్స్ సంబురాలు

- వాల్ పోస్టర్ ఆవిష్కరించిన జెవివి నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్సు సంబురాలను తొలిసారి ఆదిలాబాద్‌లో ఈ నెల 14, 15, 16 తేదీల్లో మూడ్రోజులపాటు నిర్వహించనుంది. ఈ సంబురాలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను గురువారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో నాయకులు ఆవిష్కరించారు. 2024 సంవత్సరానికి సంబంధించి చెకుముకి సైన్సు సంబురాలు పాఠశాల స్థాయి పోటీలు నవంబర్ 7న నిర్వహించగా 7,500కుపైగా పాఠశాలల నుంచి ఆరు లక్షల మందికి పైగా విద్యార్థులు పాల్గొన్న సంగతి తెలిసిందే. అదే నెల 21న మండలస్థాయి పోటీల్లో 550కి పైగా మండలాల్లో 36 వేల మంది విద్యార్థులు పోటీ పడ్డారు. 28న జిల్లా స్థాయిలో పోటీల్లో 12 వేల మంది పోటీ పడగా ప్రతి జిల్లా నుంచి నాలుగు బృందాల చొప్పున 33 జిల్లాల నుంచి 123 టీములు అనగా 396 మంది విద్యార్థులు, 132 మంది గైడ్ టీచర్లు రాష్ట్రస్థాయి సంబురాల్లో పాల్గొనున్నారు. ఈ నేపథ్యంలో నిర్వహించిన సమావేశంలో నాయకులు మాట్లాడుతూ సంబురాల్లో ప్రఖ్యాత శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, అధికారులు పాల్గొననున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు రాత పరీక్ష, యాక్టివిటీ రౌండ్, క్విట్, విజువల్ రౌండ్, క్రియేటివ్ రౌండ్, సైన్స్ ప్రయోగాలపై పోటీలు నిర్వహించనున్నట్టు తెలిపారు. అదే విదంగా సైన్స్ సెమినార్లు, శాస్త్రవేత్తలతో ముఖాముఖి, ఆకాశ దర్శనం, సైన్స్ ఎగ్జిబిషన్, మిరాకిల్ ఎక్స్పోజర్, సాంస్కృతిక కార్యక్రమాలు, సైన్స్ మ్యాజిక్, సైన్స్ గేములు, చరిత్ర గతిని మార్చిన శాస్త్రవేత్తల ఎగ్జిబిషన్, ఫీల్డ్ ట్రిప్, పుస్తక ప్రదర్శన, సైన్స్ కార్నివాల్ (స్ట్రీట్ సైన్స్ షో), ఇస్రో ఎగ్జిబిషన్లు అదనపు ఆకర్షణగా ఉంటాయని చెప్పారు. ఈ సంబురాలను విజయవంతం చేసేందుకు రాష్ట్రంలోని వివిధ సంస్థలు, సైన్స్ అభిమానులు, మేధావులు, నాయకులు, విద్యాసంస్థలు, ఉపాధ్యాయులు, ప్రజలందరూ భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు.

జన విజ్ఞాన వేదిక (జెవివి) ఎడ్యుకేషన్ సబ్ కమిటీ కన్వీనర్ కోయ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ చదువు పట్ల, ముఖ్యంగా సైన్సు పట్ల పిల్లల్లో ఆసక్తి పెంచేందుకు ప్రతి ఏటా పోటీలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. వారికిచ్చే ప్రశ్నాపత్రాలు కూడా ఆసక్తిని పెంచేలా ఉంటున్నాయని చెప్పారు. దాదాపు రెండు నెలలుగా వివిధ స్థాయిల్లో నిర్వహించే పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 20 వేల నుంచి 25 వేల మంది వాలంటీర్లు కృషి చేశారని తెలిపారు. ఉపాధ్యాయులు భాగస్వామ్యం తీసుకున్నారని అభినందించారు. సమాజంలో మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా మానికంగా ఎదిగేందుకు శాస్త్రీయ దృక్పథం అవసరమని అభిప్రాయపడ్డారు. సమాజంలో ఎలా మార్పులు జరుగుతున్నాయి?, ఏ విధంగా ఉన్నత స్థితికి వెళుతున్నారు? లాంటి విషయాలను పిల్లలకు చెప్పేందుకు ఈ ప్రయత్నమని వివరించారు.

జెవివి ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ బిఎన్ రెడ్డి మాట్లాడుతూ మొదటిసారిగా ఉత్తర తెలంగాణలోని ఆదిలాబాద్‌లో నిర్వహించడంపట్ల హర్షం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి చెకుముకి టెస్ట్, సంబురాలను క్రమం తప్పకుండా ప్రతి ఏటా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అధికారుల సహకారం బాగుందన్నారు. మీడియా కూడా తగినంత సహకారం అందించాలని కోరారు.

జెవివి కార్యదర్శి ఎన్ వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం జరిగే సంబురాలు మరింత ప్రతిష్టాత్మకమైనవని తెలిపారు. గతంలో కన్నా స్కూళ్లు, హాస్టళ్లను ఎక్కువగా భాగస్వామ్యం చేసినట్టు చెప్పారు. శాస్త్రీయ దృక్పథంతో ఆలోచించే వారంతా ఫెస్ట్‌కు సహకరించాలని కోరారు.

జెవివి ఉపాధ్యక్షులు ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ పిల్లల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు ఫెస్ట్, సంబురాలు దోహదపడుతున్నాయని తెలిపారు. మొదటిసారి ఇందులో గురుకులాల హాస్టల్ విద్యార్థులు భాగస్వాములయ్యారని చెప్పారు.

సైన్సు అంటే 'జాయ్ ఆఫ్ లెర్నింగ్' : రాజా రాజా

జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజా రాజా మాట్లాడుతూ దాదాపు 32 ఏళ్ల నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి సైన్సు సంబురాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. మూడు దశాబ్దాలుగా విద్యారంగంలో ఉన్న వారికి ఇవి సుపరిచితమే అని గుర్తుచేశారు. సైన్సు పట్ల ఆసక్తి పెంచడం, ప్రతి ఘటన సైన్సుతో ముడిపడ్డదే అని వివరించడం, సమాజంలో ఉన్న రకరకాల మూఢనమ్మకాలను పటాపంచలు చేసే లక్ష్యంతో సంబురాలను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కేవలం మార్కులు, ర్యాంకులు అనే కాకుండా సైన్సును 'జాయ్ ఆఫ్ లెర్నింగ్' పద్ధతిలో నేర్చుకునేలా ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. నవంబర్ 7న సివి రామన్, మేడం మేరీక్యూరీ జన్మదినాల సందర్భంగా పాఠశాల స్థాయిలో పోటీలు మొదలయ్యాయని తెలిపారు. ఇందులో పాల్గొనేందుకు గురుకులాల సొసైటీలతో పాటు ప్రయివేటు యాజమాన్యాలు సహకరించాయని ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రస్థానం ఒక ఉత్సాహవంతమైన అనుభవమని హర్షం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జేవీవీ మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి శ్రవణ్ కుమార్, హైదరాబాద్ నగర నాయకులు డి.అల్తాఫ్, చాగంటి సాయి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎంవి రమణా రెడ్డి

డబ్బులు తీసుకున్నట్టు ఆరోపణలు బాధాకరం

- శిల్పి ఎంవి రమణా రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతన తెలంగాణ తల్లి విగ్రహం నిర్మాణానికి ఈ నాటికీ ఒక్క రూపాయి కూడా అడ్వాన్స్ తీసుకోలేదని, ప్రభుత్వ కాంట్రాక్టు పనులకు అడ్వాన్స్‌లు కూడా ఉండవనే విషయం సిధారెడ్డికి తెలియదా అని, డబ్బులు తీసుకున్నట్టు ఆరోపణలు బాధాకరమని శిల్పి, చిత్రకారుడు ఎంవి రమణా రెడ్డి అన్నారు. సిద్దిపేటలోని ప్రెస్ క్లబ్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ రకమైన ప్రెస్‌మీట్ పెట్టాల్సిరావడం చాలా బాధాకరమని, ఆత్మగౌరవంతో బతికే కళాకారునిగా, కళనే నమ్ముకొని, కళకోసం పరితపించి, ఈ ప్రాంత గౌరవాన్ని, ఖ్యాతిని ప్రపంచానికి చాటి, రాజకీయాలకు అతీతంగా తనవంతు పాత్ర పోషిస్తూ ముందుకు వెళ్తున్నానన్నారు. తెలంగాణ ఉద్యమంలో తనవంతు క్రియాశీలక పాత్ర పోషిస్తూ, ఎన్నో ఆర్ట్ క్యాంపులు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించినట్టు తెలిపారు. ఎన్నో పోస్టర్లు, డిజైన్లు, లోగోలు వేసానని, తొలి ఆర్ట్ క్యాంపు సిద్దిపేటలోనే మొదలైందని అన్నారు. చిన్ననాటి నుంచి తనను దగ్గరగా చూసి కూడా నందిని సిధారెడ్డి నూతన తెలంగాణ తల్లి రూపశిల్పులపై అభాండాలు మోపడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాంలో తాను ప్రభుత్వ సంస్థలకు చేసిన నాలుగైదు పనుల్లో నేటికీ బిల్లులు విడుదల కాలేదన్నారు. ఉన్నత పదవుల్లో ఉన్న వారు ఈ ప్రాంతానికి చెందిన నాయకులు ఏ ఒక్కరూ సహాయం చేయలేదని, పైగా కోట్లు తిన్నారనడం సిగ్గుచేటన్నారు. గణతంత్ర దినోత్సవ వేడుకలకు తెలంగాణ తొలి శకటాన్ని (బోనాలు) డిజైన్ చేసిన దానికిగాను నేటికీ ఒక్క రూపాయి కూడా రాలేదని, గ్రామజ్యోతి లోగో డిజైన్‌కు నేటికీ ఒక్క రూపాయి కూడా రాలేదని, సిధారెడ్డి చైర్మన్‌గా వ్యవహరించిన తెలంగాణ సాహిత్య అకాడమీ లోగోకు కూడా ఒక పెద్దమనిషికి రూ.50 వేలు ఇస్తేగాని బిల్లు రాలేదని తెలిపారు. తప్పుడు ప్రచారాలను మానుకోవాలని కోరారు. ఈ సమావేశంలో న్యాయవాదులు జనార్దన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, మాజీ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంబుజ్మాడ్‌లో మళ్లీ పేలిన తూట

- 12 మంది మావోయిస్టులు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సరిహద్దు ఛత్తీస్‌గఢ్ అంబుజ్మాడ్ అడవుల్లో మళ్లీ తూట పేలింది. అటు దంతేవాడ జిల్లా ఇటు బీజాపూర్ జిల్లా సరిహద్దులోని అబూజ్‌మడ్ దండకారణ్యం రేఖ వాయ గ్రామ సమీపంలో జరిగిన ఎదురుకాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు దంతేవాడ ఎస్‌పి గౌరవరై తెలిపారు. గురువారం ఎస్‌పి మీడియాకు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం తెల్లవారుజామున నారాయణపూర్, దంతేవాడ జిల్లాల సరిహద్దులోని దక్షిణ అంబుజ్మాడ్ అడవుల్లో ఇంద్రావతి ఏరియా కమిటీకి చెందిన 40 నుంచి 50 మంది పెద్ద క్యాడర్ మావోయిస్టులు ఉనికి ఉన్నట్టు సమాచారం అందడంతో దంతెవాడ, నారాయణపూర్, కొండగావ్, బస్తర్ జిల్లాలకు చెందిన సైనికులు, డిఆర్‌జి, ఎస్‌టిఎఫ్, సిఆర్‌పిఎఫ్ బలగాలు అడవిని చుట్టుముట్టాయి. దాంతో బలగాలకు, మావోయిస్టులకు మధ్య భీకరంగా ఎదురు కాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో 12 మంది మావోయిస్టులు మృతిచెందినట్టు ఎస్‌పి ధృవీకరించారు.

గంజాయి డాన్ అంగూర్ బాయ్ అరెస్టు

- పది కేసుల్లో నిందితురాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధూల్‌పేట్‌లో గంజాయి డాన్‌గా పిలువబడుతున్న అంగూర్ బాయ్‌ని కార్వాన్ ప్రాంతంలో ఎస్‌టిఎఫ్, ఎక్సైజ్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. గంజాయి అమ్మకాల్లో రూ. కోట్లకు పడుగెత్తిన అంగూర్ బాయ్‌పై ధూల్‌పేట్‌లో మూడు, మంగల్‌హట్‌లో నాలుగు, ఆసిఫ్‌నగర్, గౌరారం ఎక్సైజ్, పోలీస్ స్టేషన్లలో పది కేసుల్లో ముద్దయిగా ఉంది. ఎక్సైజ్, పోలీసులు ఎన్నిమార్లు నిఘా పెట్టిన అంగూర్ బాయ్ తప్పించుకొని తిరుగుతొంది. ఇప్పటికే 13 కేసుల్లో నిందితురాలుగా జైలుకు వెళ్లి వచ్చింది. ఆమె కుటుంబానికి చెందిన 15 మందిపై పదుల సంఖ్యలో కేసులున్నాయి. ధూల్‌పేట్‌లో గంజాయి హోల్‌సేల్, రిటేల్ అమ్మకాల్లో ఆమె అరితేరారు. అపరేషన్ ధూల్‌పేట్‌లో భాగంగా అంగూర్ బాయ్‌ని అరెస్ట్ చేసిన ఎస్‌టిఎఫ్, ఎక్సైజ్ పోలీసులను ఆబ్కారి శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి అభినందించారు.